సమ్మెకు సై

రేపటి నుంచి స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె

- 20న పర్మినెంట్ కార్మికులు..
- నేడు ఆర్ఎల్‌సీ సమక్షంలో చర్చలు



స్టీల్‌ప్లాంట్ ముఖచిత్రం



స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు (ఫైల్)

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును వ్యతిరేకిస్తూ మంగళవారం నుంచి సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈ అంశంపై స్పష్టమైన హామీ లభించకపోవడంతో కార్మికులు నిరసన బాట పట్టనున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఈ విషయంపై మౌనం వహించడం గమనార్హం. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ స్టీల్‌ప్లాంట్‌లోని ఉద్యోగులను తగ్గించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే 1500 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించగా, మరో 2 వేల మందిని తొలగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చర్యలను నిరసిస్తూనే కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును నిరసిస్తూ కార్మిక సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. ఇందులో భాగంగా ఫిబ్రవరి 20న సమ్మె నోటీసు అందజేసిన కార్మిక సంఘాలు, మార్చి 7 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు దిగుతామని హెచ్చరించాయి. తమ డిమాండ్లకు మద్దతుగా మార్చి 7న బీసీ గేటు వద్ద మానవహారం నిర్వహించాయి. అనంతరం మార్చి 9న గాజువాకలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టాయి. తమ నిరసనను కొనసాగిస్తూ మార్చి 18న ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా నిర్వహించాయి.

రీజినల్ లేబర్ కమిషనర్ చర్చలు

తొలగింపు అంశంపై మార్చి 27న ఆర్ఎల్‌సి సమక్షంలో జరిగిన చర్చలు విఫలం కావడంతో, కాంట్రాక్ట్ కార్మికులు మార్చి 28న సమ్మె చేశారు. ఆ తర్వాత కూడా ఆర్ఎల్‌సీ సమక్షంలో పలుమార్లు చర్చలు జరిగినా యాజమాన్యం నుంచి స్పష్టమైన హామీ లభించలేదు. దీంతో ఏప్రిల్ 16న మళ్లీ సమ్మెకు పిలుపునివ్వగా, ఆర్ఎల్‌సీ జోక్యంతో మే 20 వరకు తొలగింపులు ఉండవనే హామీతో కార్మిక సంఘాలు సమ్మెను వాయిదా వేశాయి. అయితే మే 20 సమీపిస్తుండటంతో మళ్లీ సమ్మె పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఆర్ఎల్‌సీ ఉక్కు యాజమాన్యం, కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా, జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు మే 20న సమ్మెకు సిద్ధమైన పర్మనెంట్ కార్మిక సంఘాలు, దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తమ సమ్మెను జూలై 9కి వాయిదా వేశాయి. కానీ, స్టీల్‌ప్లాంట్‌లోని కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు మాత్రం తమ డిమాండ్ల కోసం మంగళవారం నుంచే నిరవధిక సమ్మెకు దిగాలని నిర్ణయించాయి.

తొలగింపుపై ప్రజాప్రతినిధులు మౌనం

స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ప్రకటించామని చెబుతున్న స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు కార్మికుల తొలగింపు అంశంపై మౌనం వహించడం విచారకరం. ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం పట్ల కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా కూటమి ప్రభుత్వం వేసిన పథకంలో భాగమేనని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.



సమ్మె నోటీసు అందజేయడానికి ర్యాలీగా వెళ్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

యాజమాన్యం నిర్ణయం సరికాదు



ప్రైవేటీకరణ ప్రక్రియలో భాగంగానే కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు చేపట్టారు. ఒకవైపు లోపల ఉత్పత్తి పెరుగుతుంటే కార్మికులను తొలగించడం అన్యాయం. తద్వారా ఉన్నవారిపై పనిభారం పెరుగుతుంది. యాజమాన్యం మొండికేయడం వల్లే సమ్మె చేయాల్సి వస్తుంది.

– నమ్మి రమణ, ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ కాంట్రాక్ట్ కార్మిక సంఘం

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు అన్యాయం



స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని చూడడం అన్యాయం. ఒకవైపు మూడు ఫర్నేస్‌లు నడుపుతామని చెపుతూ మరోవైపు కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని నిర్ణయించడం దుర్మార్గం. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపకపోతే నిరవధిక సమ్మె చేస్తాం.

– బొడ్డు పైడిరాజు, ప్రధాన కార్యదర్శి, ఉక్కు శ్రామిక సంఘం

క్లుప్తంగా

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్



పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని అయాన్ డిజిటల్ ఆన్‌లైన్ పరీక్షా కేంద్రంలో ఆదివారం జరిగిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రం వద్ద నిబంధనలు అమలు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను లోపలికి అనుమతించలేదు. ప్రతి విద్యార్థిని పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా హాల్లోకి పంపించారు.

గొందేశి మహేశ్వరరెడ్డికి డాక్టరేట్



డాక్టరేట్‌తో గొందేశి మహేశ్వరరెడ్డి

పెదగంట్యాడ: సామాజిక సేవా కార్యకర్త, శ్రమ శక్తి అవార్డు గ్రహీత గొందేశి మహేశ్వరరెడ్డికి డాక్టరేట్ లభించింది. ఆయన చేసిన విశేషమైన సామాజిక సేవలను గుర్తించిన ఇంటర్నేషనల్ గ్లోబల్ పీస్ యూనివర్సిటీ (యూఎస్ఏ) ఈ నెల 17న ఢిల్లీలో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. డాక్టరేట్ అందుకున్న మహేశ్వరరెడ్డి ఆదివారం విశాఖ చేరుకోగా, వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. ఆయనకు పూలమాల వేసి అభినందనలు తెలిపారు.

బస్టాప్ ముందు వ్యర్థాల డంపింగ్



బస్టాప్ ముందు డంప్ చేసిన వ్యర్థాలు

అగనంపూడి: అగనంపూడి సమీపంలోని జాతీయ రహదారిపై పర్వీన్ మార్బుల్ షిర్డిసాయి నగర్ బస్టాప్ వద్ద నిర్మాణ వ్యర్థాలు డంప్ చేస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. షాపింగ్ మాల్ యజమాని తన నిర్మాణ వ్యర్థాలను బస్టాప్ ముందు భాగంలో డంప్ చేయడంతో ఆ ప్రాంతం కుక్కలు, పందులకు నిలయంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంక్ వెనుక భాగంలో వందలాది అపార్ట్‌మెంట్లు, వేలాది కుటుంబాలు నివసిస్తున్నాయి. రాంకీ డెవలపర్ సారథ్యంలో నిర్మించిన బస్టాప్‌ను ఆనుకొని షాపింగ్ మాల్ నిర్మిస్తున్న యజమాని, ప్రయాణికుల కోసం బస్ షెల్టర్ ఏర్పాటు చేయకపోగా, వ్యర్థాలతో నింపేశాడు. జాతీయ రహదారిపైనే ఈ వ్యర్థాలు కనబడుతున్నా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్య విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, కాలనీవాసులు మండిపడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి వ్యర్థాలను తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

తల్లిని కుమారుడి వద్దకు చేర్చిన పోలీసులు



మర్రి బందోను కుమారుడికి అప్పగిస్తున్న పీసీ చంద్రశేఖర్

పెందుర్తి: ఇంటి నుంచి బయటకు వచ్చి తప్పిపోయిన ఓ మహిళను పెందుర్తి పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. దాదాపు మూడు నెలల పాటు అనాథగా ఓ ఆశ్రమంలో ఆశ్రయం పొందిన ఆమె.. ఎట్టకేలకు పోలీసుల చొరవతో తన కుటుంబాన్ని చేరగలిగింది. వివరాలివి.. అల్లూరిసీతారామరాజు జిల్లా అరకు ప్రాంతానికి చెందిన మర్రి బందో(45) ఫిబ్రవరి 18న పని నిమిత్తం ఇంటి నుంచి నగరానికి వచ్చింది. ఆమెకు మానసిక సమస్య ఉండడంతో తిరిగి ఎలా వెళ్లాలో తెలియక, పెందుర్తి సమీపంలోని గొల్లవిల్లివానిపాలెం పరిసరాల్లో దిక్కుతోచని స్థితిలో తిరిగింది. ఈ క్రమంలో స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కేవీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు బ్లూకోట్స్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ ఆమెను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. ఆమె తన వివరాలు సరిగా చెప్పలేకపోవడంతో అనాథగా భావించి పెందుర్తిలోని లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు.

దేశభక్తిని చాటుతూ తిరంగా యాత్ర



త్రివర్ణ పతాకాలతో గాజువాక బీజేపీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక నుంచి బీచ్ రోడ్డు వరకు బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో 'తిరంగా యాత్ర' జరిగింది. 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేస్తూ, త్రివర్ణ పతాకాలను చేతబూని యాత్ర నిర్వహించారు.

ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ త్రివిధ దళాలకు సంఘీభావం తెలుపుతూ దేశవ్యాప్తంగా జరుపుతున్న తిరంగా యాత్ర, 140 కోట్ల మంది భారతీయుల ఐక్యతను ప్రపంచానికి చాటిచెప్పిందన్నారు. కార్యక్రమంలో నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, బొండ యల్లాజీరావు, సిరసపల్లి నూకరాజు, శశిధరన్ పిళ్లై, నాగేశ్వరరావు, పావని, అనిత, సోమశేఖర్, సోనీశర్మ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతుగా నిర్వాసిత కాలనీల్లో బైక్ ర్యాలీ



పెదగంట్యాడ జంక్షన్‌లో ర్యాలీ ప్రారంభిస్తున్న సీహెచ్ నర్సింగరావు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు ఉపాధి భద్రత కల్పించే వరకు పోరాడతామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నర్సింగరావు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం చేపట్టనున్న జాతీయ సమ్మెకు మద్దతుగా ఆదివారం పెదగంట్యాడలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పెదగంట్యాడ జంక్షన్‌లో సీహెచ్ నర్సింగరావు ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఏకకాలంలో 2 వేల మంది కార్మికులను తొలగించడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోతులు తీసి..వదిలేసి..



రాజీవ్‌నగర్‌లో పూడ్చకుండా వదిలేసిన గొయ్యి



కూర్మన్నపాలెం కూడలిలో ప్రమాదకరంగా మారిన గొయ్యి

కూర్మన్నపాలెం : కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ తవ్విన గోతులు ప్రమాదకరంగా మారాయి. ఎవరు, ఎందుకు తవ్వారో తెలియని ఈ గోతుల వల్ల ప్రజలు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో, వాహనాలు ఎక్కువగా తిరిగే చోట ఈ గోతులు ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా కూర్మన్నపాలెం ముఖ్య కూడలి వద్ద పరిస్థితి దారుణంగా ఉంది. జాతీయ రహదారి కావడంతో, డివైడర్‌ను ఆనుకొని గోతులు ఉండటంతో వాహనచోదకులు జారి పడుతున్నారు. రాజీవ్‌నగర్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి, ప్రమాదకరంగా మారిన ఈ గోతులను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



కిశోర్‌కుమార్ మృతదేహం



ప్రమాదంలో నుజ్జయిన స్కూటీ

ఆరిలోవ: జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఆరిలోవ ఎస్ఐ రాందాసు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలేనికి చెందిన తిప్పాడ కిశోర్‌కుమార్(32) సోఫా సెట్లు కుట్టే పనిచేస్తుంటాడు. అతడు అవివాహితుడు. ఏదో పనిమీద శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నగరం నుంచి ఎండాడ వైపు స్కూటీపై బయలుదేరాడు. ఎండాడ పెట్రోల్ బంక్ వద్ద యూటర్న్ తీసుకొని కొంత దూరం వెళ్లిన తర్వాత డివైడర్‌ను ఢీకొని ప్రమాదానికి గురయ్యాడు. అదే సమయంలో మధురవాడ వైపు నుంచి నగరంలోకి వెళ్తున్న గుర్తు తెలియని వాహనం అతడిపై నుంచి దూసుకుపోయింది. దీంతో కిశోర్‌కుమార్ తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. అతను నడిపిన స్కూటీ నుజ్జయింది. ప్రమాద విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు కేసు నమోదు చేశామని ఎస్ఐ రాందాసు తెలిపారు. సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు,రేపు తాగు నీటి సరఫరాకు అంతరాయం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి ఆర్‌హెచ్‌సీ పినమడక వద్ద ప్రధాన పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టనున్నందున సోమ,మంగళవారాల్లో ఆయా ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేయనున్నట్టు నీటిసరఫరా విభాగం ఏఈ కేథరీనా తెలిపారు. 79, 85 వార్డుల పరిధిలోని గల్లవానిపాలెం, శనివాడ, పాత అగనంపూడి, బీసీకాలనీ, ఉప్పరకాలనీ, అట్టవానిపాలెం, లేమర్తి, ఈ బోనంగి, ఏదూరువానిపాలెం, ఏడుమెట్ల మర్రిపాలెం, వినాయకనగర్, గంగిరెడ్లకాలనీ, మంత్రిపాలెం, గెంజిపేట, శ్రీరామ్‌నగర్‌కాలనీ, గొల్లపేట, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలకు నీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. ప్రజల సౌకర్యార్థం ఈ ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామన్నారు.

రూ.15 వేలు విరాళం



విరాళం అందజేసిన అక్కిరెడ్డిపాలేనికి చెందిన గోవింద నామాల టీం సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్‌టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి అక్కిరెడ్డిపాలేనికి చెందిన గోవింద నామాల బృంద సభ్యులు రూ.15 వేల విరాళం అందజేశారు. ఈ విరాళంతో శ్రీవారి భక్తులకు అవసరమైన కుర్చీలను సమకూర్చనున్నారు. విరాళాన్ని టీం సభ్యులు దివ్యక్షేత్రం ట్రస్ట్ సభ్యులకు అందజేశారు.

ఎయిడ్స్ మృతులకు కొవ్వొత్తుల నివాళి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

మహారాణిపేట: అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆదివారం ర్యాలీ, సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ప్రారంభించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సత్యం జంక్షన్ మీదుగా రామాటాకీస్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ మౌనం పాటించారు.

బ్రహ్మకుమారీస్ సేవలు ప్రశంసనీయం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ బీకే సోమేశ్వరి

అగనంపూడి: ప్రపంచ శాంతి, మానవాళి మనశ్శాంతి కోసం కృషి చేస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను విశాఖ జిల్లా లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్ కిడిమి హనుమంతురావు కొనియాడారు. అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ, కూర్మన్నపాలెం ఏ ప్లస్ ఆస్పత్రి సంయుక్తంగా అగనంపూడిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించాయి. ఈ సందర్భంగా కిడిమి హనుమంతురావు మాట్లాడుతూ, బ్రహ్మకుమారీస్ సంస్థ నెలనెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ పేదలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. బ్రహ్మకుమారీస్ జిల్లా కోఆర్డినేటర్ బీకే సోమేశ్వరి మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని విస్మరిస్తున్నారని, మానసిక శాంతితో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. పేద ప్రజల కోసమే ఆసుపత్రి యాజమాని సుబ్బరాజు సహకారంతో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ శిబిరంలో 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, రక్త పరీక్షలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, ఆస్పత్రి నిర్వాహకులు సుబ్బరాజు, డాక్టర్ కేజే నాయుడు, గంతకోరు అప్పారావు, బీకే రామకోటి తదితరులు పాల్గొన్నారు.

85వ వార్డులో..

జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలో కూర్మన్నపాలెం ఫోర్ ఎస్ మల్టీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఆసుపత్రి ఎండీ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ, సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు.

అ'పూర్వ' కలయిక



ఆనాటి గురువులతో అగనంపూడి పూర్వ విద్యార్థులు

అగనంపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993–94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మూడు దశాబ్దాల తర్వాత మళ్లీ కలిశారు. తమ పాత స్నేహితులను చూసి, ఆనాటి తీపి జ్ఞాపకాలను, అల్లరి చేష్టలను గుర్తు చేసుకుంటూ ముసిముసి నవ్వులతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమను తీర్చిదిద్దిన నాటి గురువులను గుర్తు చేసుకుని వారిని ఆప్యాయంగా ఆహ్వానించి సత్కరించారు. పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రతినిధులు బలిరెడ్డి నాగేశ్వరరావు, విందుల పాపారావు, గుర్రం శ్రీను, జాజుల అప్పారావు, జె.బుల్లి లక్ష్మి, కె.సత్యవేణి ఈ కార్యక్రమానికి సారథ్యం వహించారు. ఈ కలయిక పూర్వ విద్యార్థులందరికీ మరపురాని అనుభూతిని మిగిల్చింది.

టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి చోటు

మద్దిలపాలెం: న్యూ నవ్యాంధ్ర రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో విశాఖ నుంచి ఇద్దరికి చోటు లభించిందని ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. మద్దిలపాలెం కృష్ణా కళాశాల సమీపంలోని సాయిసంతోష్ టైలర్స్ షాప్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా నియామకమైన ఇమంది త్రినాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితుడైన షేక్ రసూల్‌కు సత్యనారాయణ నియామక పత్రాలు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా త్రినాథ్, రసూల్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా అసోసియేషన్‌కు చేస్తున్న సేవలను గుర్తించి తమకు రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలియజేశారు. ఎప్పటిలాగే టైలర్స్‌కు అందుబాటులో ఉంటు మరిన్ని సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయ సలహాదారులు టి.పుల్లయ్యనాయుడు, విశాఖ జిల్లా కోశాధికారి వై.గౌరీశంకర్, షేక్ ఇమామ్, పి.లక్ష్మీనారాయణ, ఆచారి ముత్యాలరావు, లక్ష్మి, ఇ.భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

దేవీపురంలో ముగిసిన శ్రీవిద్య శిక్షణ



శిక్షణలో పాల్గొన్న దేశ విదేశాలకు చెందిన శ్రీవిద్య ఉపాసకులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో ఈ నెల 14 నుంచి 18 వరకూ నిర్వహించిన శ్రీవిద్య మిడ్‌లెవెల్ కోర్సు ఆదివారంతో ముగిసింది. ప్రాథమిక స్థాయి శిక్షణ పూర్తి చేసుకుని, వచ్చిన దేశ, విదేశాలకు చెందిన శ్రీవిద్య ఉపాసకులను ఈ శిక్షణ అనంతరం గురుమాత అన్నపూర్ణమ్మ ఆశీర్వదించారు. కుల మత భేదాల్లేకుండా ఇటువంటి బ్రహ్మ విద్యను అందరికీ అందుబాటులోకి తేవాలన్న ఆలోచనతో నేర్పిస్తున్న ఈ విద్య ఎక్కడికి వెళ్లినా, వారితో పాటు అందరికీ మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శిక్షకురాలు కందర్ప రమ తదితరులు పాల్గొన్నారు.